నిపుణుల సలహాలు:

# కాబినెట్టు కార్ఖానా

"అంగారక పుం"

కొన్నాళ్ళక్రిందట ఎసెంబ్లీ కాఫీ హోటల్లో ఒక అపూర్వవ్యక్తిని కలుసుకున్నాను.

మామూలుగా హోటలుకువెళ్ళి కావలసినవి చెప్పి, యాదాలాపంగా దిక్కులు చూస్తూ కూర్చున్నాను. ఇంతలోకే వచ్చి పడ్డారు ఒక గుంపు. కొందరు ఎసెంబ్లీ సభ్యులూ, వారి పరివారమూ. హోటల్ వాళ్ళకు వాళ్ళ రుచులేమిటో బాగా తెలుసు. కనుక, ఏంకావాలో అడిగే బెడద లేకుండా, సరాసరి ఒక పెద్ద వాదంలోకి దిగారు. ప్రభుత్వపు ఆదాయం పెరగటానికి వ్యవసాయంమీదనే ఎక్కువ పన్నులు వేయాలా, లేక పరిశ్రమలమీదనే వేయాలా అనే సమస్యమీద వాద ప్రతివాదాలు ప్రారంభమైనవి. ప్రభుత్వం షావుకార్లతో లాలూచీఅయి రైతుల్ని నిరాదరిస్తున్నదని కొంతమందిఅంటే, రైతుల వోట్లకోసం ఆశపడి పరిశ్రమలను ఉపేక్షిస్తున్నదని మరికొందరు అన్నారు. ఈ తర్జనభర్జనలు అంతకంతకూ పెరిగిపోయి, హోటల్ కప్పు లేచిపోతుందా అన్న పరిస్థితిలో నాకు నవ్వు ఆగలేదు. ఎంతో కష్టంమీద దానిని ఆపుకుంటూ ముఖం మరోవైపుకి తిప్పేటప్పటికి, నా అవస్థే పడుతున్న మరొకవ్యక్తి కనిపించాడు. ఒకళ్ళ సంగతిని ఒకళ్ళు గుర్తించినట్లు కనుబొమ్మలు ఎగరవేశాము.

ఇంతలో సర్వర్లు సరుకులను తెచ్చి మమ్మల్ని ఉద్ధరించారు.

ఆ క్రొత్తవ్యక్తి కాఫీని పూర్తిచేసి "టౌన్‌కి వస్తున్నారా" అని అడిగాడు. అవునండీ, అక్కడికే నంటూ నేను బయటికి వచ్చాను.

"ఏమండీ మీరు 'విశ్వరూపం' విలేకరులు కాదా?" అని ప్రశ్నించాడు.

అవునని ఒప్పుకున్నాను.

"అబ్బబ్బ! ఎంత ఘాటుగా వాదిస్తారండ, వాళ్లు! కాని, ఈధాటి ఎసెంబ్లీలో కనిపిస్తే ఎంత సంతోషించేవాళ్ళం?"

"పార్టీ విప్ ఉంటాడుగా, కొరడా చేత బుచ్చుకుని" అని నేను సమర్థించాను.

"ఆ మాట నిజమే ననుకోండి. అయినా ఈ వ్యవసాయ పార్టీవాళ్ళను చూడండి. కళ్ళ ఎదటవున్న భారీపరిశ్రమను వదిలేసి ఉండీ లేనట్లుగా ఉన్న చిన్న పరిశ్రమల వెంటబడి వాటిమీద తలకుమించినపన్నుల్ని రుద్దమంటారు"

"మీరు మాట్లాడేది ఏ పరిశ్రమలను గురించి?"

"కాబినెట్ల కార్ఖానాలను గురించి"

"వాటిని మాత్రం ప్రభుత్వం ఏమి వదిలి పెట్టింది? అసలే కలప దొరకటంలేదనీ, ఆ పైన—"

"అరే! మీరింకా పెరటిదోవనే వున్నారు. ఈ కార్ఖానాలమీద ప్రభుత్వం పన్నులు వేయలేదు సరికదా, అవి విధించే పన్నుల్ని చెల్లించుకుంటేచాలు. ఆ కార్ఖానాలు పని మొదలుపెడితే ఈ కాబినెట్లూ, కౌన్సిళ్లూ, ఎసెంబ్లీలూ అన్నీ అల్లకల్లోలం కావలసిందే. తమను తయారుచేసే కార్ఖానాలమీద కాబినెట్లు పన్ను లెక్కడవిధించగలవండీ?" అని ఆయన నవ్వటం మొదలు పెట్టాడు.

అప్పుడు నాకూ అర్థమై నేనూ నవ్వాను.

"కాబినెట్ నిర్మాణ పారిశ్రామిక మండలిలో నేనొక సాధారణ సభ్యుణ్ని చెప్పుకోటానికి గర్విస్తున్నాను. మీకు వేరే పనేమీ లేకపోతే, మా పరిశ్రమను గురించి నాలుగు ముక్కలు చెప్పటానికి కుతూహలపడుతున్నాను."

"ఓ, అంతకన్నా కావలసిందేమిటి?" అని జవాబిచ్చాను.

* * * *

టౌన్‌లో ఒకముచ్చటయిన భవనంలోకి ఆయన నన్ను తీసుకుని వెళ్ళాడు. చక్కగా కుర్చీలు, ఫ్యానులు అమర్చిన గదిలో కూర్చోబెట్టాడు. ఆ గదికి అంటుకునే వున్న మరొక చిన్న గదిలో ఒక టెలిఫోనూ, ఒక ఇనప్పెట్టె, అక్షరాలవరసలో పేర్చిన షెల్ఫులూ ఉన్నవి.

"మా కార్ఖానా ఇదేనండీ." అన్నాడు.

"అంత వ్యవహారమూ ఇక్కడే జరుగుతుందన్నమాట" అని నేను అందుకున్నాను

"అవును. ఇక్కడే మా కార్యక్రమంలో మొదటి ఘట్టం, చివరి ఘట్టం ఎక్కువగా జరపబడతవి. ఇక్కడే కాబినెట్లు స్థాపించబడి, కొన్నాళ్లు నిలబెట్టబడి, చివరకు లాగి వేయబడతవి. ఇక్కడే మంత్రులు గద్దె ఎక్కించబడి, కొన్నాళ్లు తైతక్కలాడించబడి, చివరకు కిందికి దొర్లించబడతారు. ఇక్కడే పార్టీలనుకూడ గట్టటం, కథలు నడిపించటం, మళ్లీ చీల్చి వేయటం జరుగుతుంది. సృష్టి, స్థితి, లయం— జగన్నాటకరంగం యావత్తూ, ఇక్కడ నడిచిపోతుంది." అని ఆయన గంభీరంగా అన్నాడు.

"మీరు కొంచం వేదాంతుల మోస్తరు ఉన్నారే?" అన్నాను.

"వేదాంతులు కాని వాళ్లెవరు? ప్రతి పార్టీకి కొన్ని సిద్ధాంతాలూ, ప్రతిసంస్థకూ కొన్ని తత్వాలూ ఉండక తప్పదుకదా."

"మీకు కోపంరాకుండా ఉంటే ఒకటి అడుగుతాను. మీ పరిశ్రమ ప్రభుత్వాలకు నిలకడ లేకుండా చేసి ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తుందేమో ?"

"ఊహు! పైపెచ్చు బలపరుస్తుందికూడా అసలు ప్రజాస్వామ్యం అంటే అధిక సంఖ్యాకుల పరిపాలనేకదా. ఒకే కాబినెట్ ఎక్కువకాలం అధికారంలోఉంటే, అది ఒక ప్రత్యేకవర్గపు నియంతృత్వం అవుతుంది. ఆ ప్రమాదం ఏర్పడకుండా నివారించటానికి మనం అడపా దడపా కాబినెట్లను మారుస్తూ ఉండాలి."

"మీరు చెప్పింది కొంతవరకూ నిజమే కాని, ఇష్టంవచ్చినట్లు—"

"లేదు. మేము ఇష్టంవచ్చినట్లు ఏపనీ చేయం. ఎంతో మెలకువతోనూ, జాగ్రత్తోనూ పనిచేస్తాం. కనక నే ఎప్పుడూ మా దెబ్బ గురి తప్పదు."

"సరే. మీ పరిశ్రమలవల్ల ప్రజాస్వామ్యం ఎట్లా బలపడుతుందో వివరించండి."

"ప్రజాస్వామ్య సిద్ధాంతకారులు ఏం చెప్పారో గమనిస్తే, మీ సందేహం తొలిగిపోతుంది. ప్రజాస్వామిక వ్యవస్థ స్థిరంగానూ, లోపరహితంగానూ ఉండాలంటే, బాధ్యతను గుర్తించి స్వేచ్ఛగా నడవగల ప్రతికూలపక్షం ఉండటం అవసరమని వాళ్ళంతా చెపుతున్నారు. ఒకే ప్రభుత్వం ఎక్కువకాలం అధికారంలో ఉంటే ప్రతికూలపక్షం క్రమక్రమంగా బలహీనపడక తప్పదు."

"మీరు మరీ అతిశయోక్తి చేస్తున్నారు."

"అయితే మీ కొక ఉదాహరణ చూపిస్తాను. బ్రిటన్‌ని తీసుకోండి. అక్కడ లేబర్ ప్రభుత్వం లార్డ్సు సభ అధికారాలను కత్తిరించి పారేస్తున్నది. పాపం, ఇప్పుడు లార్డ్సు సభ ఏ బిల్లునయినా ఒకఏడాదివరకు మాత్రమే నిలిపి ఉంచగలదు. లార్డ్సుసభలో బలంగావున్న కన్సర్వేటివ్‌లకు ఇది పెద్ద దెబ్బ అయింది. మరొక విషయం చూడండి

(19-వ పేజీ చూడండి)

# కాబినెట్ల కార్ఖానా

(-14వ పేజీ తరువాయి)

ఐక్యరాజ్యసమితి ప్రజాస్వామిక సంస్థే కదా. కాని డాలర్లను కురిపించి ఎక్కువ వోట్లను సంపాదించిన అమెరికా 'వీటో' అధికారానికి స్వస్తి చెప్పాలనీ, భద్రతామండలి అధికారాలను సర్వసభ్య సమావేశానికి కట్టిపెట్టాలనీ ప్రయత్నిస్తున్నది. వోట్లు కలవాళ్ళదే రాజ్యమైనప్పుడు, ఎదటి పక్షాలకు రక్షణ ఏమున్నది?"

"సరే, దానికి అంగీకరిస్తాను. కాని ప్రతికూలపక్షపు బాధ్యత మాటేమిటి?"

"అదే చెప్పబోతున్నాను. తాముకూడా అధికారంలోకివచ్చి ఇప్పుడు ప్రభుత్వాన్ని పెడుతున్న చిక్కులే తాముకూడా అనుభవించగలమన్న భయం ప్రతికూల పక్షానికి లేకపోతే వాళ్లు బాధ్యతగా ఎందుకు వుంటారు? మొదటినించీ చివరవరకూ తమకు అధికారం రాదన్న నమ్మకం వాళ్లకి కలిగితే కేవలం ప్రభుత్వాన్ని ఊదరపెట్టటమే ముఖ్యమైనపనిగా పెట్టుకుంటారు. అట్లా కాకుండా, మాబోటివాళ్ళ ధర్మమా అని అధికారం వస్తుందన్న ఆశ వుంటే 'ఒరులేయవి యొనరించిన తన మనంబున కప్రియంబగు...' అన్న పద్యంలో చెప్పినట్లు బుద్ధిగా ఉంటారు."

"ఈ విధంగా అనుగడుక్కీ తలలు మార్చటం వల్ల పరిపాలన దెబ్బ తింటుందేమో!"

"ఎప్పటికీ దెబ్బతినదు. మనది శాంతియుతమైన పార్లమెంటరీ వ్యవస్థ. ఒకసారి శాసనసభకు ఎన్నిక అయితే, టరం తీరేవరకూ కడుపులో చల్ల కదలకుండా కూర్చోవచ్చు. మళ్లీ దానిని మార్చాలన్న భయమే అక్కర్లేదు. ఇంక ఉన్నవాళ్లు 'గుడుగుడు కుంచం' ఆట ఆడుకోవచ్చు. గద్దె మీద ఎల్లయ్యావున్నా, పుల్లయ్యావున్నా, వ్యవహారానికి లోపం రాదు. పరిపాలనా వ్యవహారాలను నిర్వహించటానికి ఉద్యోగులుఉండనే ఉన్నారు.

కాబినెట్ల మార్పువల్ల పరిపాలనకు ఆటంకం కలక్కుండా ఉండటానికి ముఖ్య కారణం మరొకటి ఉన్నది. ప్రజాస్వామ్యంలో శాసనసభ్యులకు కావలసినది చతుర్విధ స్వాతంత్ర్యాలూ, వాటన్నిటికీ మించిన ధనార్జన స్వాతంత్ర్యమూ, వీటికి అడ్డంరానంతవరకూ వాళ్లు చేసే మార్పులు పరిపాలనకి అడ్డంరావు."

"ఒక ఉదాహరణయినా చూపిస్తే-"

"తప్పకుండా. ఫ్రాన్సును చూడండి. ఒక్క ఏడాది తిరిగివచ్చేలోపల డజను మంత్రివర్గాలు అక్కడ మారిపోయినై. సోషలిస్టులు, రాడికలిస్టులు, డీగాలిస్టులు, ఎడంచేతివాళ్లు, కుడిచేతివాళ్లు, మూడోచేతివాళ్లూ ఒక్కరేమిటి? అంతా వరస తిప్పేశారు. కాని ఈ మార్పులవల్ల ఇండోచైనాలో ఫ్రాన్స్ చేస్తున్న యుద్ధ ప్రయత్నాల్లో మార్పేమయినా వచ్చిందా?"

రాలేదని అంగీకరించక తప్పలేదు.

"ఒక్కమాట. మీ పరిశ్రమ ప్రభుత్వానికి డబ్బు సమకూర్చగలదనీ, ప్రమాదాలనుంచి రక్షించగలదనీ మీరు నిరూపించ కలిగితే, మీ గొప్పతనాన్ని అంగీకరిస్తాను" అని అన్నాను.

"అది అంతకష్టమయిన విషయం కాదు. ప్రమాదాలనుంచి రక్షించే విషయాన్ని తీసుకోండి. ఎడతెగని జాగ్రత్త అనేది ప్రజాస్వామ్యానికి విలువ అని చెపుతారు. అంటే మన 'బ్రాండు' ప్రజాస్వామ్యానికి ఎవరు శత్రువులా అని ఎప్పుడూ కనిపెట్టి ఉండాలన్నమాట. ప్రభుత్వానికి శత్రువులెవరో, అధికారంలో ఉన్నవాళ్ళకంటే ఇవతల ఉన్నవాళ్ళకు ఎక్కువగా తెలిసే అవకాశం ఉన్నది. కాబట్టి ఇవతల ఉన్నవాళ్లకు అధికారం వస్తూఉంటే వాళ్లు ఒకొక్క శత్రువునే వరసగా ఏరిపారేస్తారు.

ఇంక రెండో విషయం. ప్రభుత్వానికి డబ్బు వచ్చేది పన్నుల మూలంగానే. అయితే ఒకే ప్రభుత్వం అనేక రకాల పన్నులను వేయటానికి భయపడవచ్చును. అంతేకాదు అనేక అవకాశాలు వాళ్లకు కనిపించకపోవచ్చును. కొత్త ప్రభుత్వాలు ఏర్పడుతుంటే పాతపన్నులను ఉంచటమే కాక కొత్త వాటిని తగిలిస్తూ ఉండొచ్చు."

"దీనికికూడా ఒక ఉదాహరణ ఇస్తారా?"

"ఇదివరకు 'పాతాళప్రదేశ్'లో ఒక ప్రభుత్వం సిగరెట్లమీద పన్ను వేసింది. అప్పుడు ప్రజలుబాదం ఆకుల్లో పొగాకు చూరవేసి కాల్చటం మొదలుపెట్టారు. కాని ప్రభుత్వం భయపడి ఊరుకున్నది. రెండునెలలు కాగానే కొత్త ప్రభుత్వం వచ్చింది. అది చేసిన మొదటిపని బాదం ఆకులమీదా, పొగాకు చూరమీదా పన్ను వేయటమే."

ఆ అఖండ వాదానికి నిలబడలేకపోయినాను.

"మీరు వ్యవహారం ఎట్లా నడిపిస్తారు?" అని ప్రశ్నించాను.

"ఆ గదిలో షెల్ఫులవరసనూ, ఇనప్పెట్టెనూ చూశారు కదా! ఆ షెల్ఫులలో మా ప్రాంత శాసనసభ్యుల జీవిత వివరాలు యావత్తూ ఉన్నవి. సభ్యులకుగల కోరికలూ, ఉన్న విద్వేషాలూ, తీరనికోర్కెలూ, ఆరని పగలూ, అన్నీ పూర్తిగా సేకరిస్తాము. ఇవన్నీ తెలిసిన తరవాత, పక్కనఉన్న ఇనప్పెట్టె తోడ్పాటుతో మేము చేయలేని పని ఏముంటుంది?"

"మీ పరిశ్రమకు మూలపురుషులు ఎవరండీ?"

"హిందూమతం మోస్తరుగా మాకు అనేక మహాపురుషుల సాంప్రదాయాలు ఉన్నవేకాని మూలపురుషుడంటూ ఎవరూ లేరు. మాకియవెల్లీ, చాణక్యుడు, డిజ్రేలీ మొదలైనవాళ్ళు ఆ మహాపురుషుల్లో కొందరు."

"మీ పరిశ్రమ ఇప్పుడు ఎక్కడ జోరుగా సాగుతున్నది?"

"భారతదేశంలో మద్రాసు బాగా వుండేది. కాని ఇప్పుడది పశ్చిమబెంగాల్, తూర్పు పంజాబ్, మధ్య భారత్ మొదలైన చోట బాగా ఉన్నది. విదేశాల్లో మొదట చెప్పవలసింది ఫ్రాన్సు."

"మీ ధాటికి గురిఅయిన వాళ్లకథ లేమయినా వివరిస్తారా?"

"ఆత్మస్తుతి మాకిష్టంలేదు. కాని ఫ్రెంచి అధ్యక్షుడు ఓరియోల్, గ్రీక్ రాజు, సర్దార్ పటేల్, డా॥ పట్టా, ప్రకాశంగారు మొదలైనవాళ్లను ఎవరినడిగినా, మీకు మా తడాఖా తెలుస్తుంది."

"మీకున్న అనుభవాన్నిపట్టి ప్రజాస్వామ్యానికి ఆధారమేమిటో సెలవిస్తారా?"

"శాసనసభ్యుల్లో అతి ప్రధానమైన భేదాలేవీ ఉండకూడదు. ఏదో స్వల్పవిషయాల్లో మాత్రమే భిన్నంగా ఉండి, కుడి ఎడమగా సర్దుకునిపోయే వాళ్లయి ఉండాలి. ప్రధాన భేదాలే ఉంటే ప్రజాస్వామ్యానికీ, మాపరిశ్రమకూ బ్రేక్ పడక తప్పదు."

"అందుకని?"

"అందుకని, వచ్చే ఎన్నికల్లో, వోటు చేసే టప్పుడు జాగ్రత్తపడండి. పెద్ద పార్టీ అయిన కాంగ్రెస్‌తో ఆట్టే భేదాలులేని ఏ సోషలిస్టుల్నో ఎన్నుకోండి. అంతేకాని ఆర్. ఎస్. ఎస్. వాళ్లనూ, కమ్యూనిస్టుల్ని మాత్రం పొరబాటునైనా ఎన్నుకోవద్దు" అని అంటూ ఆయన రిస్టువాచివంక చూసుకున్నాడు.

ఆ సూచనగ్రహించి, ఆయనకు నాలుగు థాంక్సు పడేసి, నెమ్మదిగా జారుకున్నాను.

---